APTEL /25/A2478

# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 55 గుంటూరు, బుధవారం 05- 11 - 2025 పేజీలు : 4 వెల. 2 /-

రిపోర్టర్లు కావలెను
క్రైమ్ కౌంటర్
తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.
సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349



# అక్కడ కూడా వేట

**ఇంటర్నెట్ డెస్క్: నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లండన్ పర్యటన కొనసాగుతోంది. పర్సనల్ టూర్ అని ప్రకటించినప్పటికీ సీఎం చంద్రబాబు, ఏపీకి పెట్టుబడుల వేట అక్కడ కూడా కొనసాగిస్తున్నారు. లండన్‌లో అనేకమంది దిగ్గజాలతో భేటీ అవుతున్నారు. తాజాగా భారత హైకమిషనర్ శ్రీ విక్రమ్ దొరైస్వామితో సీఎం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ – యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం, విద్యా సహకారం, ఆవిష్కరణలు, ప్రవాస భారతీయులతో మమేకమై రాష్ట్రానికి మేలు జరిగేలా చూడ్డం తదితర అంశాలు ఈ భేటీలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

ఈ సమావేశం రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపరచేందుకు ఉపకరిస్తుందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలు, యుకెతో సహకారంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ చర్చలు ఏపీలో ఆర్థిక అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు తగిన తోడ్పాటునిచ్చేలా సాగాయి. భేటీకి ముందు, హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

# రాజీపడబోం..

## అధికారులకి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు



**అమరావతి, నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** 'సాస్కి' పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్.

ఆ బాధ్యత అధికార యంత్రాంగానిదే..

సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2లో

# జగన్ కాన్వాయ్ ఢీ.



**కృష్ణా: నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** పెనమలూరు నియోజకవర్గంలో మాజీ సీఎం జగన్ కాన్వాయ్ అడ్డు అదుపు లేకుండా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉయ్యూరు మండలం గండిగుంట వద్ద కాన్వాయ్ వాహనాలు ఒక దాని కొకటి ఢీకొన్నాయి. దీంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ మేరకు రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి.. వాహనాలు నిలిచిపోయాయి. ఎంత మ్నొర పెట్టుకుంటున్నా వినకుండా.. జగన్ కాన్వాయ్ ఇష్టం వచ్చినట్లు ముందుకు సాగిందని పోలీసులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతల అత్యుత్సాహం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. పోలీసుల నిబంధనలను వైసీపీ నేతలు ఉల్లంఘిస్తున్నారు. డీజే ఏర్పాటు చేయగా.. అనుమతి లేదని పోలీసులు దాన్ని తీయించారు. దీంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నేతల తీరుతో హైవేపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హైవేపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దని పార్టీ నేతలకు పోలీసులు సూచించారు.అయితే గతంలో కూడా.. మాజీ సీఎం జగన్ పర్యటనలో ఇలాంటి వివాదాలు చోటు చేసుకున్నాయి. సత్తెనపల్లి పర్యటనలో భాగంగా ఓ

2లో

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**అమరావతి, నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 70వ రోజుకు చేరుకుంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం మరోసారి జనసంద్రంగా మారింది. మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు 4 వేల మందికి పైగా ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను ఓపికగా విన్నారు.ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్య తీవ్రతను బట్టి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే బాధ్యత తమదని, అందరికీ అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో అధికశాతం మంది గత వైసీపీ ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న కష్టాలను, అన్యాయాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసులు బనాయించారని, ఆస్తులు లాక్కున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త దనపాన హరికృష్ణ మంత్రి లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన మెరిగల రవిబాబు, తన వారసత్వ భూమిని వైసీపీ కార్యకర్త కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, పోలీసులు స్పందించడం లేదని వాపోయారు. టీడీపీ సానుభూతిపరుడిననే కారణంతో అతిథి అధ్యాపకుడి ఉద్యోగం నుంచి తొలగించారని కర్నూలు జిల్లాకు చెందిన ఉలిద్ర రవి మంత్రికి తన గోడును వెళ్లబోసుకున్నారు. ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా పలు ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్

2లో

# జగన్ పై అచ్చెన్నాయుడు ఫైర్



**అమరావతి, నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరు మీద వైసీపీ నేతలు చేస్తున్న నాటకాలు ఆపాలని హితవు పలికారు. కడప జిల్లాలో ఏమి జరుగుతోందో చూడని అవినాశ్‌కి.. ఇప్పుడు రైతులపై అంత ఆకస్మికంగా ప్రేమ ఎందుకు..? వచ్చిందని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉల్లి రైతులు నష్టపోకూడదని సీఎం చంద్రబాబు ఆలోచించి హెక్టార్‌కి రూ.50,000 చొప్పున అందజేయాలని నిర్ణయించారని తెలిపారు. తమ ప్రభుత్వంలోఉల్లి రైతులకు రూ.104.57 కోట్ల లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు మంత్రి అచ్చెన్నాయుడు. ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టినప్పుడు క్వింటాకు రూ.1200 వెచ్చించి మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్ నందు సుమారు రూ.17. 22 కోట్ల విలువ గల ఉల్లి పంటను కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. ఉల్లి పంట పాడవ్వకుండా రైతులకు తమ ప్రభుత్వం మేలు చేసిందని వివరించారు. 2020లో వైసీపీ హయాంలో ఉల్లి ధర పడిపోతే మద్దతు ధర రూ.770లు ప్రకటించడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 129 మంది రైతుల నుంచి 970 మెట్రిక్ టన్నుల ఉల్లిని మాత్రమే సేకరించి, రైతులకు కేవలం రూ.75 లక్షలు మాత్రమే చెల్లించిన విషయం అవినాష్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు మంత్రి అచ్చెన్నాయుడు.

జగన్ హయాంలో క్వింటాకు ఉల్లి ధర రూ.770 నిర్ణయించారని, కానీ రైతుల శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు ఉత్తమ నిర్ణయంతో క్వింటాకు

2లో

# ఆ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త.. 7 వేల మందికి లబ్ధి!



**అమరావతి, నవంబర్ 04 (క్రైమ్ కౌంటర్ న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. ఓ వైపు పెట్టుబడుల ఆకర్షణ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూనే.. మరోవైపు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజలతో పాటుగా ఉద్యోగుల అవసరాలకు కూడా తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల దసరా పండుగ సందర్భంగా ఏపీ ఉద్యోగులకు ప్రభుత్వం డీఏ ప్రకటించింది. అలాగే దీపావళి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీఎస్ఆర్టీసీలో ఏడువేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించనున్నట్టు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సోమ వారం చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఉద్యోగుల వైద్యశాలను మంత్రి

2లో

# రాజీపడబోం.. అధికారులకి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ.2వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు. ఈ నిధులతో ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.

దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం..

ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఏపీకి సాస్కి నిధులు సమకూరాయని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామని సూచించారు. ఈ నేపథ్యంలో సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్.

# జగన్ కాన్వాయ్ ఢీ.

వ్యక్తి కారు కిందపడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వెంగళాయపాళెం గ్రామానికి చెందిన 50 ఏళ్ల చీలి సింగయ్య జగన్ కారు కిందపడి ప్రాణాలు విడిచారు. అలాగే.. అనంతపురం జిల్లా రాప్తాడులో పర్యటనలో కూడా వివాదం చోటుచేసుకుంది. జగన్ హెలికాప్టర్‌లో అక్కడికి చేరుకున్నారు. ఆయన చూడడానికి వందలాది వైసీపీ కార్యకర్తలు హెలికాప్టర్ వద్దకు దూసుకొచ్చారు. జనాలను పోలీసు సిబ్బంది నియంత్రించలేక పోయ్యారు. దీంతో జనం తాకిడితో హెలికాప్టర్ విండ్ షీల్డ్(అద్దాలు) ధ్వంసమైయ్యాయి.

అయితే మాజీ సీఎం జగన్ పర్యటనలో.. ఘోరాలు, నేరాలు జరుగుతున్న ఆయన మాత్రం పర్యటనలు మానడం లేదు. పర్యటనల పేరుతో.. వైసీపీ కార్యకర్తల, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వారి గురించి ఏమాత్రం శ్రద్ధ చూపకుండా.. తన ఇష్టారాజ్యంగా పర్యటనలు చేస్తూ.. జగన్ ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యటన సమయంలో.. పోలీసుల, అధికారుల నిబంధనలను పట్టించుకోకుండా.. పర్యటనలు కొనసాగిస్తున్నారని మండిపడుతున్నారు.

# జగన్ పై అచ్చెన్నాయుడు ఫైర్

రూ.1200 పెట్టి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో రైతుల సమస్యలు అవినాశ్‌రెడ్డికి కనిపించలేదా..? అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు, విపత్తుల సమయంలో మాత్రమే వైసీపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు మంత్రి అచ్చెన్నాయుడు.

గత ఐదేళ్లు రైతులు ఇబ్బందులు పడుతుంటే అవినాశ్ రెడ్డి కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారా..? అని ప్రశ్నించారు. నష్టపరిహారం ఫైళ్లు పెండింగ్‌లో పెట్టింది కూటమి ప్రభుత్వం కాదని%ౌ% గత జగన్ ప్రభుత్వ గందరగోళ విధానాలేనని ఎద్దేవా చేశారు. రైతుల పేరు చెప్పుకుంటూ రాజకీయ లాభం చూడటం అవినాశ్‌రెడ్డి స్వభావమని విమర్శించారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే కనీస అర్హత అవినాశ్‌రెడ్డికి లేదని ఫైర్ అయ్యారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఉద్ఘాటించారు. అన్నదాతలకు అందచేస్తున్న పథకాలు, ధరలు తగ్గినప్పుడు వారికి ఇస్తున్న పరిహారాలు వైసీపీ నేతల కళ్లకు కనపడటం లేదా..? అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నల వర్షం కురిపించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

అసోసియేషన్ కోరింది. ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సేవలను క్రమబద్ధీకరించి, వేతన సవరణ చేయాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గూడెంలలో కొత్త పాఠశాలలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ప్రతినిధులు కోరారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. విజయవాడ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గరిమెళ్ల అనిల్ కుమార్ ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్యసాయం అందించాలని చిత్తూరుకు చెందిన ప్రకాశ్ బాబు కోరారు. వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

# ఆ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త.. 7 వేల మందికి లబ్ధి!

మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. రూ.54.51 లక్షలు ఖర్చు చేసి ఈ వైద్యశాలను నిర్మించారు. ఈ వైద్యశాల ద్వారా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అందిస్తారని మంత్రి వివరించారు. మరోవైపు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో ఎలక్ట్రికల్ బస్సులు నడపనున్నట్లు మంత్రి వెల్లడించారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇక రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో 1,450 బస్సులు కొనుగోలు చేశామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వివరించారు.మరోవైపు దీపావళి కానుక కింద ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించిన సంగతి తెలిసిందే. ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్ఆర్టీసీలోని నాలుగు కేడర్ల ఉద్యోగులకు ప్రమోషన్ల అవకాశం కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీపావళి రోజున ఉత్తర్వులు జారీ చేసింది. మెకానిక్‌లు, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఆర్టిజన్స్ కేడర్ఉద్యోగులకు పదోన్నతులు కల్పించనున్నారు.మరోవైపు క్రమశిక్షణ చర్యలు, పెనాల్టీలు, పనిష్మెంట్లు పక్కన బెడుతూ.. వాటితో సంబంధం లేకుండానే ప్రమోషన్లు పొందేందుకు అర్హత కల్పించడం విశేషం. అయితే గతంలో ఈరకమైన మినహాయింపు ఆర్టీసీ ఉద్యోగులకు ఉండేది. ప్రభుత్వంలో విలీనం కాకముందు ఈ మినహాయింపు ఉండేది. అయితే 2020లో విలీనమైనప్పటి నుంచి ఇతర శాఖల ఉద్యోగుల రూల్స్ ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వర్తించాయి.

# కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గర్భిణీలు, రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ



**గోకవరం నవంబర్ 4 క్రైమ్ కౌంటర్ ప్రతినిధి** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా రెండేళ్ల నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మంగళవారం కూడా యధావిధిగా రామసేన సిబ్బంది గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను అందజేశారు. తన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి, లేదు అనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని, కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సిబ్బంది సూర్యప్రకాష్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్ మీట్ కుహో (శ్రీకాకుళం)హో విద్యార్థి ముప్పిడి ప్రసాద్ ఎంపిక




**గోకవరం నవంబర్ 04 క్రైమ్ కౌంటర్ ప్రతినిధి**స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీలలో తూర్పుగోదావరి జిల్లా స్థాయి (కాకినాడ)లో స్టేట్ మీట్‌హో (శ్రీకాకుళం) కి లూథరన్ హై స్కూల్, జాంపేట విద్యార్థి ముప్పిడి ప్రసాద్ ఎంపికైనట్లు హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ డి శ్రీకాంత్ తెలిపారు. గోకవరం మండలంలోని తన స్వగృహం నుండి మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడారు. అండర్ 14 విభాగంలో 400 మీటర్స్ ప్రథమస్థానం, లాంగ్ జంప్లో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు గతంలో సౌత్ జోన్ బాయ్స్ అండ్ గర్ల్స్‌హో అథ్లెటిక్స్ లో 3 బంగారు పతకాలు, 3 కాంశ్య పతకాలు సాధించి బాపట్ల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలోనూ, 38 వ జూనియర్ స్టేట్ మీట్‌హో లో 3 బంగారు పతకాలు, 4 కాంశ్య పతకాలు, ఒక రజతం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు గుంటూరులో పాల్గొనడం జరిగింది. విద్యార్థులుఅథేలిటిక్స్ లోనే కాకుండా కబడ్డీ, ఖో ఖోహో మండల స్థాయి, డివిజన్ స్థాయిలో, స్థానాలు సాధించి జిల్లా జట్లకు ఎంపికయ్యారు.హో దీని పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఎం. ఐజయా, హెచ్ఎం జెమీమా, స్టాఫ్ సెక్రటరీ మార్టిన్ సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్స్ డి శ్రీకాంత్, సి హెచ్ సువర్ణముహి ని అభినందించారని తెలిపారు.

# జయంతి వేడుకల్లో పాల్గొన్న గంగారావు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** బిర్సా ముండా 150 వ జయంతి సందర్భంగా జన్ జాతీయ గౌరవ దివాస్ 2025 లో భాగంగా కమ్యూనిటీ అవుట్ రీచ్ ఐఇసి క్యాంపెయిన్ బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో మంగళవారం పాల్గొన్నారు బెల్లంకొండ మండల తెదేపా బీసీ సెల్ అధ్యక్షులు గుంజా గంగారావు . ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి . వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు గ్రామంలోని ఎస్సీ ప్రజలు తమ కాలనీలలో ఉన్న సమస్యలను ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు సమస్యలు పరిష్కరిస్తానని ఎల్ఫేర్ ఆఫీసర్ హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో రాంబాబు, మండల అభివృద్ధి అధికారి, ఐసిడిఎస్ సూపర్వైజర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి మరియు సచివాల సిబ్బంది పాల్గొన్నారు .

# యూనియన్ బ్యాంక్ మేనేజర్ రైతుమిత్ర గ్రూపులకు కిసాన్ డ్రోన్ స్ప్రేయర్



**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం.** దుర్గి మండలంలోని ముటుకూరు మరియు ఓబులేసునిపల్లె గ్రామం నందు మండలం వ్యవసాయ అధికారి,దుర్గి మరియు యూనియన్ బ్యాంకు మేనేజర్ వారు మండలంలోని 2 రైతు మిత్ర గ్రూపులు - శ్రీ ఆంజనేయ రైతు మిత్ర గ్రూప్, ముటుకూరు, మరియు శ్రీ యోధ రైతుమిత్ర గ్రూప్, ఓబులేసునిపల్లె గ్రూపులకు కిసాన్ డ్రోన్ స్ప్రేయర్ జాయింట్ ఇన్స్పెక్షన్ కొరకు ఈ రెండు గ్రూపుల ను సందర్శించినారు.ఈ డ్రోన్ పూర్తి ఖరీదు : 9,80,000/-,సబ్సిడీ 7,80,000/-,గ్రూప్ వాటా 2,00,000/- మొత్తం 80% సబ్సిడీ తో ప్రభుత్వం ద్వారా గ్రూప్ కు అందించబడుతుంది. ఈ డ్రోన్ 10 లీటర్ల కెపాసిటీతో ఇది ఒక ఎకరం స్ప్రేయింగ్ చేయుటకు కేవలం 6 నిముషముల సమయం పడుతుంది దీని వలన కూలీల సమస్యను అధిగామిస్తూ సమయం ఆదా అవుతుంది,దీని స్ప్రే ఫ్లో వచ్చేసి 0.8-3 లీటరు/మిని లి అని తెలియజేసారు.ఈ కార్యక్రమం నందు దుర్గి మండల వ్యవసాయ అధికారి వారు వై.అమీర్ రెడ్డి ,యూనియన్ బ్యాంకు మేనేజర్ అమర లింగేశ్వరరావు మరియు డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు,గ్రూప్ సభ్యులు, పాల్గొన్నారు.

# మొక్కలు నాటేందుకు రోడ్డు పక్కన గుంతలు తీస్తున్న ఎక్స్‌కవేటర్

**విద్యార్థుల భాగస్వామ్యంతో ఒకేరోజు ఐదువేల మొక్కలు**
**ప్రధాన రోడ్ల వెంట నాటేలా ఎమ్మెల్యే జనార్దన్ ప్రణాళిక**
**పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు**

ఒంగోలు, నవంబరు 4 : ఒంగోలు నగర సుందరీకరణ, మౌలిక సౌకర్యాల మెరుగుపై దృష్టి సారించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మరో భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 7న నగరంలో ఒకే రోజు ఐదువేల మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఒక్కో విద్యార్థి ఒక్కో మొక్కను ఏకకాలంలో నాటేలా నగరంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో మాట్లాడారు. ఆ విధంగా వేలాది మందిని కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నారు. నగరంలోని మంగమూరు రోడ్డు, గుంటూరు రోడ్డు కొత్తపట్నం రోడ్డు.. ఇలా మొత్తం ఎనిమిది ప్రధాన రోడ్లలో మొక్కలు నాటనున్నారు.



# ఏయూలో ఎందుకిలా!? విద్యార్థుల వరుస ఆందోళనలు

**వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనలు**
**గత ప్రభుత్వ హయాంలో సమస్యలున్నా మౌనం**
**కార్యాలయం ఎదుట ఇనుప గ్రిల్స్ ఏర్పాటుచేసినా ప్రశ్నించేందుకు సాహసించని వైనం**
**తాజాగా రోడ్డెక్కి మరీ బైఠాయింపు**
**శతాబ్ది ఉత్సవాల వేళ వర్సిటీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై సీనియర్ ప్రొఫెసర్ల ఆందోళన**



విశాఖపట్నం, నవంబరు 4 ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఏదో ఒక సమస్యపై తరచూ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయిస్తున్నారు. గతంలో ఉన్నతాధికారులను ప్రశ్నించడానికి, అసలు సమస్యను చెప్పుకోవడానికి కూడా ముందుకురాని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు...ఇప్పుడు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్సిటీలో పాలకులు మారారు. తొలుత ప్రొఫెసర్ జి.శశిభూషణ్ ఇన్‌చార్జి వీసీగా నియమితులు కాగా, ఆ తరువాత పూర్తిస్థాయి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో శశిభూషణ్, ఇప్పుడు రాజశేఖర్ హయాంలో అనేకమార్లు విద్యార్థులు ఆందోళనలు నిర్వహించారు. అదే ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో విద్యార్థి సంఘాలు గానీ, విద్యార్థులుగానీ తమ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లేందుకు వీలుండేది కాదు. ఇప్పుడు అందుకు అవకాశం ఉన్నప్పటికీ అనేక సందర్భాల్లో విద్యార్థులు ఆందోళనబాట పట్టడం వెనుక కారణాలేమిటో అంతుబట్టడం లేదు. ముఖ్యంగా శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ విద్యార్థులు తరచూ ఆందోళనలకు దిగడం వర్సిటీ ప్రతిష్టను దిగజార్చుతుందని సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. విద్యార్థుల ఆందోళనలను వెనకుండి ఎవరో నడిపిస్తున్నారనే అనుమానాలను వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై వర్సిటీలోనూ చర్చ జరుగుతోంది.

అరడజనుసార్లు ఆందోళనలు

పాలకులు మారిన తరువాత వివిధ కారణాలతో అరడజనుసార్లకుపైగా విద్యార్థులు ఆందోళనలు చేశారు. తొలిసారి గత ఏడాది ఆగస్టులో భోజనం సరిగా లేదంటూ వివిధ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు వీసీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీనిని అప్పటి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణ్ సీరియస్‌గా తీసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. విద్యార్థుల ఆధ్వర్యంలో మెస్ కమిటీలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అలాగే, ఎప్పటికప్పుడు మెస్‌లను తనిఖీ చేసేలా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. అయితే, మెస్ కమిటీల నిర్వహణ బాధ్యతలు తీసుకునేందుకు చాలామంది విద్యార్థులు ముందుకురాలేదు. కొద్దినెలలు గడిచిన తరువాత మరోసారి అదే విధమైన ఆరోపణలతో విద్యార్థులు ఆందోళన చేశారు. ఆ తరువాత పూర్తిస్థాయి వీసీగా ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చిన తరువాత విద్యార్థుల ఆందోళనలు మరింత పెరిగాయి. భోజనం సరిగా లేదని ఒకసారి, భోజనంలో పురుగులు, జెర్రిలు ఉంటున్నాయని మరోసారి విద్యార్థులు నిరసన తెలియజేశారు. క్యాంపస్‌లోని ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలంటూ ఒకసారి ఆందోళన చేపట్టారు. ఆ తరువాత వసతి గృహాల్లో అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారంటూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థినులు ఆందోళన చేశారు. కొద్దిరోజుల కిందట హాస్టల్ విద్యార్థి ఒకరు గుండెపోటుతో చనిపోయారు. ఈ నేపథ్యంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి చనిపోయాడంటూ పదుల సంఖ్యలో విద్యార్థులు వీసీ కార్యాలయంలోకి వెళ్లి గొడవ చేశారు. వర్సిటీలో ఐఐఎంకు కేటాయించిన భవనాన్ని ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగానికి కేటాయించాలని కోరుతూ మంగళవారం పలువురు విద్యార్థులు వీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

అప్పుడు మౌనమేలా.? గతంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులను కలిసేందుకు కూడా అవకాశం ఉండేది కాదు. వీసీ కార్యాలయం ఎదుట ఇనుప కంచెలు (గ్రిల్స్) ఉండేవి. అప్పుడు ఏ విద్యార్థి సంఘం కనీసం ప్రశ్నించే ప్రయత్నం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శశిభూషణ్ ఇన్‌చార్జి వీసీగా ఉన్న సమయంలో ఆ ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు. ఇక ఆరోగ్య కేంద్రం అత్యంత దారుణ స్థితికి చేరుకోవడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణం. అయితే గత ప్రభుత్వ హయాంలో ఎవరూ ప్రశ్నించే సాహసం చేయలేకపోయారు. కానీ, ఇప్పుడు ఏదో ఒక సమస్యపై ఆందోళనలకు దిగుతుండడం క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. క్యాంపస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలనే వాదన వినిపిస్తోంది.

# ఘనంగా గ్యార్మీ వేడుకలు.!!




క్రైమ్ కౌంటర్ రాము రిపోర్టర్పామిడి, ఓబులాపురం గ్రామంలో మండలంలోని ఓబులాపురం గ్రామంలో దస్తగిరి స్వామీ గ్యార్మీ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరు గ్రామస్తులు యువకులు మాట్లాడుతూ గ్యార్మీ పండుగను ఎంతో సంతోషంగా, భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడుచుకోవాలని, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

# పర్యాటకానికి ఓపెన్ టాప్ బస్సు




# నగరంలో తెల్లవారుజామున 4.19 గంటల సమయంలో కంపించిన భూమి

**రిక్టర్ స్కేల్‌పై 4.0గా నమోదు**
**అనేక చోట్ల పెద్ద శబ్దాలు**
**విశాఖ సేఫ్ జోన్‌లో ఉందన్న భూ భౌతిక శాస్త్రవేత్తలు**
**ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటన**




విశాఖపట్నం, నవంబరు 4జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున 4.19 గంటల సమయంలో ఒక నిమిషంపాటు భూమి కంపించింది. సుమారు పది కిలోమీటర్ల లోతులో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.0గా నమోదైనట్టు నేషనల్ సెంటర్ సెస్మాలజీ వెల్లడించింది. కేంద్ర స్థానం తొట్లకొండ ప్రాంతంగా భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రధానంగా నగర పరిధిలోని అక్కయ్యపాలెం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, భీమిలి, మధురవాడ తదితర ప్రాంతాల్లో భూకంప తీవ్రత కనిపించింది. ఆ సమయంలో పెద్ద శబ్దం వినిపించింది. అప్పటికే నిద్రలేచినవారు ఈ శబ్దాలకు ఆందోళన చెందగా, నిద్రలో ఉన్న వారికి మాత్రం భూమి కంపించిన విషయం తెలియలేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల, చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా భూమి కంపించడంతోపాటు శబ్దాలు వచ్చినట్టు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

విశాఖ సేఫ్ జోన్

విశాఖ జిల్లాలో అనేకమార్లు భూకంపం వచ్చింది. అయితే, తీవ్రత ఎప్పుడూ స్వల్పంగానే ఉంటుందని, దానికి కారణం విశాఖ భూకంప తీవ్రత తక్కువగా ఉండే జోన్‌లో ఉండడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. దేశంలోని భూంకపాలు సంభవించే ప్రాంతాలకు సంబంధించిన వివరాలతో ఇండియన్ సెస్మ లాజికల్ అబ్జర్వేటర్ ఒక మ్యాప్‌ను రూపొం దించింది. ఏ ఏరియాల్లో భూకంపం ఎక్కువగా వస్తుందన్న దాన్ని ఇందులో పేర్కొంది. దీని ప్రకారం విశాఖ రీజియన్‌లో భూకంపాలు వస్తాయి. కానీ, తీవ్రత సాధారణ స్థాయిలో ఉంటుంది. విశాఖ భూకంపాలకు సంబంధించి సేఫ్ జోన్‌లోనే ఉందని నిపుణులు పేర్కొంటు న్నారు. భూకంప తీవ్రత 4.5 (రిక్టర్ స్కేల్‌పై) వరకూ ఇబ్బంది ఉండదని, అంతకు మించితే కొంత ప్రమాదం ఉంటుందని ఏయూ భూ భౌతిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పెంటకోట త్రినాథరావు వెల్లడించారు. 4.5 దాటితే భవనాలు ఊగడం, పగుళ్లు రావడం వంటివి జరుగుతాయన్నారు.

శబ్దాలకు కారణం అదే.?

సాధారణంగా భూకంపం సంభవించినప్పుడు పెద్దగా శబ్దాలు రావు. కానీ, కొన్ని సందర్భాల్లో భూకంప తరంగాలు ధ్వని తరంగాలు రూపంలోకి మారి శబ్దాలకు కారణమవుతాయి. మంగళవారం ఉదయం విశాఖ రీజియన్‌లో సంభవించిన భూకంపంతోపాటు శబ్దాలు రావ డానికి ఇదే కారణమై ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విశాఖ రీజియన్ భూకంపా లకు సంబంధించి డేంజర్ జోన్‌లో లేదని, కాబట్టి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏయూ భూ భౌతిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పెంటకోట త్రినాథరావు వెల్లడించారు. పెద్ద శబ్దం రావడంతో ఆందోళన చెందాం ఉరిటి రవికాంత్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మేము నేరేళ్లవలస కాలనీలో ఉంటున్నాం. తెల్లవారుజామున నాలుగు గంటలకు బాబు (3) నిద్రలేచాడు. మళ్లీ నిద్రపుచ్చుతున్నాం. సుమారు 4.19 గంటలకు ఇంట్లో కుడి భాగం నుంచి ఎడమ భాగానికి ఒక్కసారిగా డ్రిల్లింగ్ మిషన్ వర్క్ చేస్తున్నట్టు పెద్ద శబ్దం రావడంతో ఆందోళన చెందాము. ఏదో జరుగుతుందని బయటకు వచ్చాం. మాలాగే వీధిలో నాలుగైదు ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వచ్చారు. దీంతో భయపడి కారులో అలా, సముద్ర తీరానికి వెళ్లి కొద్దిసేపు గడిపి తిరిగి ఇంటికి చేరాం.

వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి ఆలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభ కానున్న మార్గశిర మాసోత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పక్కా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ బందోబస్తును పెట్టుకొని ట్రాఫిక్ మళ్లింపు, వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి గురు, శుక్ర, శనివారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆయా రోజులకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు. క్యూ లైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఉండాలన్నారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు సీసీ టీవీ కెమెరాలు పెట్టుకోవాలన్నారు. నిత్యాన్నదానం, ప్రసాదాల కౌంటర్లలో తగిన మంది సిబ్బందిని నియమించాలన్నారు. అన్ని విభాగాల అధికారులతో ఆలయం సమీపాన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రసాదాల నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని హెచ్చరించారు. ప్రతి గురువారం ఆ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సుల రూట్‌ను మార్చాలని సూచించారు. ఏర్పాట్లపై ముందుగానే అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలన్నారు.

వైదిక కమిటీ నిర్ణయం మేరకు

భక్తులే నేరుగా అమ్మవారికి అభిషేకాలు చేసి, పుసుపు, కుంకుమలు సమర్పించే ఆచారంపై సమావేశంలో చర్చ జరిగింది. వారిని అలా అనుమతిస్తే రద్దీకి తగినట్టుగా దర్శనాలు కల్పించడం ఆలస్యం అవుతుందని ఈఓ శోభారాణి అన్నారు. భక్తులు తీసుకువచ్చిన పసుపు, కుంకుమలను ఉద్యోగులు, వలంటీర్లు తీసుకొని అమ్మవారికి సమర్పించేలా చూస్తామన్నారు. దీనిపై వైదిక కమిటీ సూచనలు తీసుకొని ఆ ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కేటాయించిన సమయాల్లోనే దర్శనాలు: ఈఓ శోభారాణి

మార్గశిర మాసోత్సవాల్లో నాలుగు గురువారాలు (నవంబరు 27, డిసెంబరు 4, 11, 18 తేదీలు) వస్తాయని ఆ రోజుల్లో వీవీఐపీలు దర్శనాల కోసం కేటాయించిన సమయాల్లోనే రావాలని ఈఓ శోభారాణి సూచించారు. ఆయా రోజుల్లో తెల్లవారుజామున 2.30 గంటలకే దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. సాధారణ రోజుల్లో ఉదయం 6 గంటల నుంచి దర్శనాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజూ జగన్నాథస్వామి ఆలయం వద్ద ఉదయం 11 గంటల నుంచి అన్నదాన వితరణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఈఈ సీహెచ్‌వీ రమణ, ఏఈఓ రాజేంద్ర, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ డీఎఫ్‌వోగా రవీంద్ర

విశాఖపట్నం డివిజనల్ అటవీ అధికారిగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డీఎఫ్‌వో రవీంద్ర దామ (2017 ఐఎఫ్ఎస్‌బ్యాచ్) నియమితులయ్యారు. ఇక్కడ డీఎఫ్‌వోగా ఉన్న అనంతశంకర్‌ను గత ఏడాది ప్రభుత్వం బదిలీ చేసింది. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఇటీవల జూ క్యురేటర్ మంగమ్మకు అదనంగా డీఎఫ్‌వో బాధ్యతలు అప్పగించారు.

# మొక్కలు నాటేందుకు రోడ్డు పక్కన గుంతలు తీస్తున్న ఎక్స్‌కవేటర్

ఆ కార్యక్రమంలో జిల్లాలోని కీలక ప్రజాప్రతిని?ధు లంతా పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. తొలుత గతనెల 24న మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ రోజున డీఆర్సీ సమావేశం ఉండటంతో ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని వారందరితో మొక్కలు నాటించాలని భావించారు. అయితే ఆ సమావేశం వాయిదా పడటంతోపాటు మొంథా తుఫాన్ ఆ సమయంలో నగరాన్ని ముంచెత్తడంతో కార్యక్రమం వాయిదా పడింది. తిరిగి ఈనెల 7న డీఆర్సీ సమావేశం జరగనుంది. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు ఆ సమావేశానికి వస్తున్నారు. దీంతో ఆ సమావేశం లోపు వారందరూ మొక్కలు నాటేలా ఎమ్మెల్యే జనార్ధన్ కార్యక్రమాన్ని రూపొందించారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

వేలాదిమంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉండటంతో ప్రణాళికాబద్ధంగా కార్యక్రమ నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. రోడ్లు అత్యధిక భాగం సిమెంట్‌వి కాగా వాటికి ఇరువైపులా ఎక్కడ మొక్కలు నాటాలన్నది గుర్తించి మిషన్ల ద్వారా కటింగ్ చేసి గుంతలు తీస్తున్నారు. అలాగే పలు కళాశాలల యాజమాన్యాలతో మంగళవారం కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏ కాలేజీ నుంచి ఎంతమంది విద్యార్థులు హాజరవుతారు, ఏ కాలేజీ వారు ఏ రోడ్డులో మొక్కలు నాటాలన్న దానిపై చర్చించారు. ఒక్కో బస్సులో 50 మంది కాలేజీ విద్యార్థులు వస్తే వారికి కాలేజీ నుంచి ఒకరు, కార్పొరేషన్ నుంచి ఒకరు సిబ్బంది అందుబాటులో ఉండి మొక్కలను క్రమపద్ధతిలో నాటించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. అలాగే మొక్కలు నాటే రోడ్డులో ట్యాంకర్లతో నీరు, ట్రాక్టర్ ద్వారా మట్టి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు. నగరంలో పచ్చదనం పెంపు కోసం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కోరారు.

# సినిమా





## ట్రాక్ తప్పుతున్నాడా..?

తెలుగు ఇండస్ట్రీలో నటకిరీటి రాజేంద్రప్రసాద్ పేరు చెప్పగానే కామెడీ, ఎమోషనల్ పాత్రలు గుర్తొస్తాయి. కానీ ఇటీవల కాలంలో ఆయన మాటలు మాత్రం ఓవర్ బిల్డప్‌తో నిండిపోయి, మిస్‌ఫైర్ అవుతున్నాయి. రాబిన్ హుడ్ సినిమా ప్రమోషన్స్‌లో తన పాత్ర నచ్చకపోతే పేరు మార్చుకుంటానని, మాస్ జాతర క్లైమాక్స్ చూసి విజిల్స్ పడకపోతే ఇండస్ట్రీ నుంచి వెళ్ళిపోతానని చెప్పడం ఇందుకు ఉదాహరణలు. ఈ స్టేట్‌మెంట్స్ ఆయనకు ట్రోలింగ్ తెచ్చిపెట్టాయి. ఇలాంటి ఓవర్ కాన్ఫిడెంట్ మాటలు ప్రచారం కోసమే అయినా.. సినిమా ఫలితం బట్టి బూమరాంగ్ అవుతున్నాయని అంటున్నారు నెటిజన్లు. మాస్ జాతర రిలీజ్ తర్వాత రాజేంద్రప్రసాద్ మాటలను బాగా వైరల్ చేస్తున్నారు కొందరు. సినిమా ఎలా ఉందనే విషయం పక్కనబెడితే రాజేంద్రుడి స్పీచ్ మాత్రం ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.

ఇదంతా పబ్లిసిటీ స్టంట్ అయినా.. సీనియర్ నటుడిగా ఇంత బోల్డ్‌గా మాట్లాడటం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. 2024 అక్టోబర్‌లో రాజేంద్రప్రసాద్ కూతురు గాయత్రి గుండెపోటుతో మరణించింది. ఆమెకు భర్త, చిన్న కూతురు ఉన్నారు. గాయత్రి లవ్ మ్యారేజ్ చేసుకున్న తర్వాత కొంతకాలం తండ్రితో మాట్లాడలేదు. ఆయన ఆమెను తల్లిలా చూసుకునేవారు.. ఈ దురదృష్టకర ఘటన ఆయనపై తీవ్ర మానసిక ప్రభావం చూపింది. షూటింగ్‌లో ఉండగా వార్త విని హాస్పిటల్‌కు చేరుకున్నా.. ఆమెను చివరిసారి చూడలేకపోయాను అంటూ కన్నీరు పెట్టుకున్నాడు రాజేంద్ర ప్రసాద్. పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి సెలబ్రిటీలు అప్పుడు వచ్చి సంతాపం తెలిపారు. ఈ ట్రాజెడీ తర్వాత ఆయన మాటలు కాస్త ట్రాక్ తప్పుతున్నాయి.

మొదట్లో కూతురు పోయిన బాధలో మాట్లాడుతున్నాడులే అని వదిలేసారు కానీ రాను రాను ఆ మాటలు కాస్త ట్రాక్ తప్పుతున్నాయనే విమర్శలు ఎక్కువగానే వస్తున్నాయి. దుఃఖం నుంచి బయటపడేందుకు సినిమాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి, కాన్ఫిడెంట్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారేమో అనే చర్చ కూడా జరుగుతోంది. రాజేంద్రప్రసాద్ స్టేట్‌మెంట్స్ రిలీజ్ ముందు బజ్ క్రియేట్ చేస్తున్నాయి కానీ, సినిమా ఫలితం బట్టి బ్యాక్‌ఫైర్ అవుతున్నాయి. రాబిన్ హుడ్‌లో ఆయన పాత్రకు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చింది.. కానీ సినిమా అంచనాలు నెరవేరలేదు. మాస్ జాతరలో క్లైమాక్స్‌లో ఆయన రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ రివీల్ బాగున్నా.. మొత్తం సినిమా రొటీన్ స్టోరీ లైన్‌తో ఉంది. దాంతో ఇండస్ట్రీ వదిలేసి వెళ్తా అనే మాటలు ట్రోల్స్‌కు గురయ్యాయి.

నాగవంశీ లాంటి ప్రొడ్యూసర్లు కూడా ఇలాంటి స్టేట్‌మెంట్స్‌తోనే గతంలో ట్రోల్ అయ్యారు. అందుకే మొన్న మాస్ జాతర ఈవెంట్‌లో నాగవంశీ అస్సలేమీ మాట్లాడలేదు. అదే ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాటలు పబ్లిసిటీకి ఉపయోగపడ్డాయి. కానీ లాంగ్ టర్మ్‌లో ఈ మాటలు ఆయన ఇమేజ్‌కు హాని కలిగిస్తున్నాయంటున్నారు అభిమానులు. రాజేంద్ర ప్రసాద్ లాంటి సీనియర్ ఆర్టిస్ట్ ఇలాంటి బోల్డ్ స్టేట్‌మెంట్స్ ఇవ్వడం ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌ను సూచిస్తోంది. కూతురు మరణం తర్వాత ఆయన మానసికంగా కుంగిపోయి, సినిమాల ద్వారా బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఈ ఓవర్ హైప్ మిస్‌ఫైర్ అవుతుంది కాబట్టి కాస్త చూసుకుని మాట్లాడితే బెటర్ అంటున్నారు విశ్లేషకులు. మరి రాజేంద్రుడు మారతాడా.. మాట అదుపులో ఉంచుకుంటాడా అనేది చూడాలిక.





## ఆరోగ్యంతో పాటు అందానికి..

స్ట్రాబెర్రీలు ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తాయో, తినడానికి కూడా అంతే రుచికరంగా ఉంటాయి. స్ట్రాబెర్రీలలో ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇవి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడతాయి. రోజూ స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. వ్యాధుల నుండి రక్షిస్తుంది. స్ట్రాబెర్రీలలో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అధిక రక్తపోటు ఉన్న వృద్ధులకు స్ట్రాబెర్రీలు తినడం ప్రయోజనకరంగా ఉంటుంది. స్ట్రాబెర్రీలలో పొటాషియం అధికంగా ఉంటుందని, ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

స్ట్రాబెరీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. గ్లైసెమిక్ సూచీ కూడా తక్కువగా ఉంటుంది. కాబట్టి, రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగనివ్వకుండా చేస్తాయి. అంతేకాదు, ఇది గుండె ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ పెంచుతుంది. తద్వారా గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది. రోజూ స్ట్రాబెర్రీలను తినడం వల్ల శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకానికి చికిత్స చేస్తుంది .

స్ట్రాబెరీలో విటమిన్ సి ఉంటుంది. ఇది సీజనల్ జబ్బులు రాకుండా కాపాడుతుంది. స్ట్రాబెరీలో ఉండే విటమిన్ సి, ఎలెజిక్ యాసిడ్ కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. దీంతో మీ చర్మం సన్ డ్యామేజ్ కాకుండా ఉంటుంది. యాంటీఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉండే ఈ పండు వృద్ధాప్యాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల ముడతలు అదుపులో ఉండి, యవ్వన చర్మాన్ని ఎక్కువ కాలం కాపాడుతుంది.



## తొక్కే కదా అని పారేయకండి..

నిమ్మ తొక్కలు నిజంగా ఇంట్లో ఒక మాయాజాలం చేస్తుంది. వాటిని పారవేయడం చేయకండి. దీంతో క్లీనింగ్, చర్మాన్ని తాజాగా ఉంచడం కోసం లేదా మీ ఇంటిని మంచి వాసనతో నింపడం కోసం వరకు నిమ్మ తొక్కలు ప్రతిచోటా ఉపయోగకరంగా ఉంటాయి. కాబట్టి, తదుపరిసారి మీరు నిమ్మకాయను జ్యూస్ చేసినప్పుడు, దానిని పారవేయడానికి బదులుగా, తొక్కను ఉపయోగించండి. ఇది మీ ఇంటిని స్థిరంగా ఉంచుతుంది. మీ డబ్బును ఆదా చేస్తుంది.

నిమ్మ తొక్కలలో ఉండే సహజ నూనెలు, విటమిన్ సి మన చర్మం, జుట్టు, ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఈ తొక్కలు బ్యాక్టీరియాను చంపడానికి, దుర్వాసనలను తొలగించడానికి, వస్తువులను ప్రకాశవంతం చేయడానికి సహాయపడతాయి. ఈ తొక్కలో లభించే ముఖ్యమైన పోషకాలు ఇక్కడ ఉన్నాయి.

విటమిన్ సి: ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కణాల నష్టాన్ని నివారిస్తుంది. ఫైబర్, పెక్టిన్: ఇవి జీర్ణవ్యవస్థకు సహాయపడతాయి. త్వరగా ఆకలి వేయకుండా, ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తాయి.

ఫ్లేవనాయిడ్స్, డి-లిమోనీన్: ఇవి కొవ్వు జీవక్రియను పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం: ఇవి ఎముకల ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తాయి. శరీర విధులను నియంత్రిస్తాయి.

కొవ్వు జీవక్రియ మీరు బరువు పెరగటం గురించి ఆందోళన చెందుతుంటే, ఖచ్చితంగా మీ ఆహారంలో నిమ్మ తొక్కను చేర్చుకోండి. ఇది బరువు తగ్గడానికి బాగా సహాయపడుతుంది. నిమ్మ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. అందువలన, ఇది కేలరీల తీసుకోవడం నియంత్రించడంలో సహాయపడుతుంది.

ముఖ్యంగా, నిమ్మ తొక్కలోని %ణ%- లిమోనీన్ అనే సమ్మేళనం శరీర కొవ్వును కాల్చడానికి జీవక్రియను మెరుగుపరుస్తుంది. ఈ సహజ నూనె బొడ్డు కొవ్వును కరిగించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది కొవ్వును సమర్థవంతంగా కరిగించి బరువు నిర్వహణకు మద్దతు ఇస్తుంది.

నిమ్మ తొక్కను పేస్ట్ లా ఎలా ఉపయోగించాలి? మీ దినచర్యలో నిమ్మ తొక్కలను చేర్చుకోవడం చాలా సులభం. వాటిని బాగా కడిగి, ఎండలో లేదా స్టవ్ మీద తక్కువ మంట మీద ఆరబెట్టండి. వాటిని బ్లెండర్ లో మెత్తగా పొడి చేయండి. ఈ పొడిని ప్రతి ఉదయం ఒక గ్లాసు నీటిలో లేదా గోరువెచ్చని నీటిలో కలిపి త్రాగాలి.

## గాయం కారణంగా ఛాన్స్ మిస్ చేసుకున్న స్టార్ క్రికెటర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్?లో ఆడటానికి సిద్ధమైన భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. బీబీఎల్ తదుపరి సీజన్‌లో సిడ్నీ థండర్ తరఫున ఆడడం దాదాపు ఖాయమైనప్పటికీ, గాయం కారణంగా ఆయన ఈ లీగ్ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. అశ్విన్ గనుక ఆడి ఉంటే, బీబీఎల్లో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా చరిత్ర సృష్టించి ఉండేవారు. అశ్విన్‌కు అయిన గాయం ఏమిటి? ఎప్పుడు తిరిగి వచ్చే అవకాశం ఉంది? వంటి వివరాలు ఈ వార్తలో చూద్దాం.

భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్ మైదానంలోకి తిరిగి రావడానికి మరింత వేచి చూడాల్సి వస్తుంది. మోకాలి గాయం కారణంగా ఆయన ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ నుంచి తప్పుకున్నారు. అశ్విన్ బీబీఎల్ లో సిడ్నీ థండర్ జట్టు తరఫున పూర్తి సీజన్ ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ అశ్విన్ ఆడి ఉంటే బీబీఎల్ చరిత్రలో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా నిలిచి ఉండేవారు. కానీ గాయం కారణంగా ఈ చారిత్రక అవకాశం ప్రస్తుతానికి మిస్ అయింది. అశ్విన్ త్వరగా కోలుకుంటే, సీజన్ మధ్యలో సిడ్నీ థండర్ జట్టు అతన్ని తిరిగి ఆడటానికి ఆహ్వానించే అవకాశం ఉంది. అశ్విన్ స్వయంగా సోషల్ మీడియాలో ఒక ప్రకటన





విడుదల చేసి, తన గాయం, బీబీఎల్ నుంచి వైదొలగడం వెనుక కారణాలను తెలియజేశారు. "బీబీఎల్ తదుపరి సీజన్‌కు చెన్నైలో సిద్ధమవుతున్న సమయంలో నాకు మోకాలిలో గాయం అయింది. పరీక్షల తర్వాత, నేను బీబీఎల్ 15లో ఆడలేనని తెలిసింది" అని అశ్విన్ తన ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియన్ అభిమానుల ముందు ఆడటానికి తాను ఎంతగానో ఉత్సాహంగా ఉన్నానని, కానీ ఈ నిర్ణయం తీసుకోవడం తనకు బాధ కలిగించిందని ఆయన వ్యక్తం చేశారు.

సిడ్నీ థండర్ ఆటగాళ్లు, సిబ్బంది తనకు పూర్తి మద్దతు ఇచ్చారని అశ్విన్ తెలిపారు. మైదానంలో లేకపోయినా, తాను థండర్ మహిళా, పురుషుల జట్లను ఉత్సాహపరుస్తూ ఉంటానని చెప్పారు. రవిచంద్రన్ అశ్విన్ అదే సంవత్సరంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బీబీఎల్ లో ఆడాలని నిర్ణయించుకున్నారు. అశ్విన్ ఈ సంవత్సరం ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఆ తరువాత అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటానికి మొగ్గు చూపాడు. బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ డిసెంబర్ 14 నుంచి జనవరి 25 వరకు జరగనుంది. సిడ్నీ థండర్ జట్టు తమ మొదటి మ్యాచ్‌ను డిసెంబర్ 16న హొబర్ట్ హరికేన్స్‌తో ఆడాల్సి ఉంది. ఈ మధ్యలో అశ్విన్‌కు %×టూ%20 లీగ్‌లో ఏ జట్టు కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

## ఆరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ.

సౌత్ ఆఫ్రికా క్రికెట్‌కు సంబంధించిన ఓ యువ సంచలనం ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి చెందిన టీనేజ్ సెన్సేషన్, లువాన్-డ్రే ప్రిటోరియస్ తన తొలి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. పాకిస్థాన్‌తో ఫైసలాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్, కేవలం 47 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. అంతేకాదు, ఈ 19 ఏళ్ల యువ ఆటగాడు.. క్రికెట్ దిగ్గజం జాక్వెస్ కల్లిస్ నెలకొల్పిన 30 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టి, సౌత్ ఆఫ్రికా తరఫున అతి పిన్న వయసులో వన్డే హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. సౌత్ ఆఫ్రికా యువ బ్యాట్స్‌మెన్ లువాన్-డ్రే ప్రిటోరియస్ తన అంతర్జాతీయ కెరీర్‌ను అద్భుతంగా ప్రారంభించాడు. పాకిస్థాన్‌తో ఫైసలాబాద్‌లో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో అతను తనదైన స్ట్రోక్స్ ఆడారు. ఈ లెఫ్ట్ హ్యాండర్ కేవలం 47 బంతుల్లో వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించాడు. ప్రిటోరియస్ తనదైన దూకుడైన ఆటను ప్రదర్శించాడు. పాకిస్థాన్ పేసర్ నసీమ్ షా తొలి ఓవర్‌లోనే రెండు బౌండరీలు కొట్టడం ద్వారా తన వన్డే కెరీర్‌ను ఆరంభించాడు. స్పిన్నర్ సల్మాన్ అలీ ఆగా బౌలింగ్‌లో రెండు ఫోర్లు, ఒక సిక్సర్ బాదాడు. అబ్రార్ అహ్మద్ బౌలింగ్‌లో సింగిల్ తీసి హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీ సాధించడంతో, ప్రిటోరియస్ సౌత్ ఆఫ్రికా క్రికెట్ చరిత్రలో 30 ఏళ్లుగా ఉన్న ఒక పెద్ద రికార్డును బద్దలు కొట్టాడు. 19 ఏళ్ల 222 రోజుల వయసులో హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా, లువాన్-డ్రే ప్రిటోరియస్ సౌత్ ఆఫ్రికా తరఫున వన్డేల్లో అతి పిన్న వయసులో 50 పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతను 1996లో 20 ఏళ్ల 93 రోజుల వయస్సులో ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ సాధించిన క్రికెట్ దిగ్గజం జాక్వెస్ కల్లిస్ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ జాబితాలో క్వింటన్ డి కాక్ కూడా ఉన్నాడు. ప్రిటోరియస్ ఇప్పటికే మూడు ఫార్మాట్లలో తన ప్రతిభను చాటుకున్నాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ఈ యువకుడిని ముందుగానే గుర్తించింది. ఈ ఏడాది జూలైలో జింబాబ్వేతో జరిగిన టెస్ట్ అరంగేట్రంలోనే ప్రిటోరియస్ 160 బంతుల్లో 153 పరుగులు సాధించి అద్భుతంగా రాణించాడు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన ఐపీఎల్?లో, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ నితీష్ రాణా స్థానంలో ఈ 19 ఏళ్ల యువ ఆటగాడిని కొనుగోలు చేసింది. ఫ్రాంచైజీ అతన్ని దీర్ఘకాలిక పెట్టుబడిగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అద్భుతమైన ప్రదర్శనల నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ ఐపీఎల్ 2026 సీజన్ కంటే ముందు అతన్ని అట్టిపెట్టుకునే అవకాశం ఎక్కువగా ఉంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.